పది పరీక్ష ప్రశాంతం





వెంకటగిరి: జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి, వెంకటగిరి: పరీక్షరాసేందుకు వీల్‌ఛైర్‌లో వస్తున్న దివ్యాంగ విద్యార్థి

- కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన
- 144 సెక్షన్ అమలు

గూడూరు: డివిజన్‌లో సోమవారం పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు తాగునీటి వసతి, బెంచ్‌లు, పరిసరాల్లో మెడికల్ క్యాంప్ తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి సీఐలు, ఎస్‌ఐలతో కలసి ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలును పర్యవేక్షించారు.

436 మంది హాజరు

చిట్టమూరు: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మొత్తం 444 మంది విద్యార్థులకు గాను 436 మంది మొదటి రోజు హాజరయ్యారని ఎగ్జామినేషన్ అధికారి వెంకయ్య తెలిపారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని చిలమానుచేను, ఓజిలి పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండు పరీక్ష కేంద్రాల్లో 285 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు. ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి బందోబస్తు పర్యవేక్షించారు.

దొరవారి సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలో తొలిరోజు పది పరీక్షలు రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో 251 మందికి గాను 249 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఏకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 134 మందికి 132 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. పరీక్షలకు చీఫ్‌గా పార్థసారథి, ముత్తుస్వామి వ్యవహరించారు. నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్‌ఐ తిరుమలరావు కేంద్రాలను తనిఖీ చేశారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 411 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కలువాయి ఎస్‌ఐ మహేంద్ర, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక ఉన్నత పాఠశాల్లో 177 మందికి గాను 173 మంది, బాలికల ఉన్నత పాఠశాల్లో 120 మందికి 118 మంది, కండలేరు జలాశయంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 114 మందికి 113 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్ష నిర్వహణ తీరును తహసీల్దార్ విజయలక్ష్మి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట ఆర్‌ఐ నారాయణ తదితరులున్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలో పది పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకుని తమ పిల్లలను పరీక్షకు పంపారు. మండలంలో మొత్తం 538 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

తడలో..

తడ: పదో తరగతి పరీక్షల్లో భాగంగా తొలి రోజు జరిగిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 308 మంది విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరయ్యారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చీఫ్ ఎగ్జామినర్ శంకరయ్య, డిపార్ట్‌మెంట్ అధికారి ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం తొలి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

వెంకటగిరిలో..

వెంకటగిరి: మండలంలో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని మొత్తం 6 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగినట్లు ఎంఈఓ టి వెంకటేశ్వర్లు తెలిపారు. 1,159 మంది రెగ్యులర్ విద్యార్థులకుగానూ1,150మంది హాజరయ్యారన్నారు.

బాలాయపల్లిలో....

మండలంలోని బాలాయపల్లె, జయంపు ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. బాలాయపల్లిలో 126 మందికి 125 మంది, జయంపులో 86 మందికి 84 మంది హాజరయ్యారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ లక్ష్మన్న తెలిపారు.

881 మంది హాజరు

కోట: మండలంలో తొలిరోజు తెలుగు పరీక్షకు 892 మందికి గాను 881 మంది హాజరైనట్లు ఎంఈఓ వెంకట సునీల్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పోలీసుల భద్రత ఏర్పాటు చేశారు. కాగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.

నాయుడు పేటలో ..

నాయుడుపేట: నాయుడుపేటలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం జరిగాయి. 1,370 మంది విద్యార్థులకు గాను 1,357 హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంఈఓ పర్యవేక్షణలో పది ప్రశ్నాపత్రాలు తీసి పరీక్ష కేంద్రాలకు పంపారు.



గూడూరు: పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్



తడ: జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



నాయుడుపేట: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

సీఎం జగన్‌తో ఎమ్మెల్సీ మేరిగ భేటీ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితోపాటు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఎమ్మెల్యేలతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళీధర్ తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపినట్లు మేరిగ మురళీధర్ పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి

దక్కిలి: పౌష్టికాహారంతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి తెలిపారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం లింగసముద్రం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు మార్చుతున్నారని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లుతోపాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడమే పోషణ్ పక్వాడా ముఖ్య ఉద్దేశం అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులకు జెడ్పీటీసీ సభ్యురాలి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

వెంకటగిరి: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సొంత నిధులతో నగదు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. సోమవారం ఆమె తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమని, ప్రతి విద్యార్థీ తల్లిదండ్రులు ఆశలు నెరవేర్చడంతోపాటు, వెంకటగిరి, తాను చదువుతున్న పాఠశాల కీర్తిని పెంచేలా కష్టపడి చదివి, మంచి ప్రతిభ కనబరచాలన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ఆర్‌వీఎం ఉన్నత పాఠశాల, కేంద్రియ విద్యాలయలో ఆయా పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5 వేలు, ద్వితీయస్థానం సాధించి న వారికి ఒక్కొక్కరికి రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.2 వేలు వంతున నగదు ప్రో త్సాహకాలను విద్యార్థి ఇంటికే వెళ్లి అందజేస్తానన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న తహసీల్దార్

చిల్లకూరు: మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన సిబ్బందితో పలు భూ సమస్యలపై సమీక్షించారు. తీర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కోస్టల్ కారిడార్‌కు సబంధించిన భూ సేకరణ, అలాగే సాగరమాలకు చెందిన భూ సేకరణపై దృష్టి పెట్టి నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో వీఆర్వోలు చొరవ చూపాలన్నారు. అలాగే ప్రభుత్వం చుక్కల భూములను రెగ్యులర్ చేసే విషయంలో నిబంధనలు సడలించిన నేపథ్యంలో వెంటనే వాటి పనులు కూడా మొదలు పెట్టాలన్నారు.

క్లుప్తంగా

వైభవం.. పుష్పయాగం



పుష్పార్చన చేస్తున్న అర్చకులు

చిల్లకూరు: తమ్మినపట్నంలోని కోదండరామాలయంలో జరుగుతున్న నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం కోదండ రామునికి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో సీతారాములకు 100 రకాల పుష్పాలతో పుష్పయాగం చేశారు. భక్తులు ఈ పుష్పయాగంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ యాగంలో ఆలయ ఈఓ కోవూరు జనార్దనరెడ్డి, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ యరటపల్లి సాయిపృద్వీరెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గునపాడు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టమూరు: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు చిట్టమూరు మండలం గునపాడు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య సోమవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో స్వెటీ హైజంప్‌లో మొదటి స్థానం, జన్నై కబడ్డీలో విజయం సాధించారన్నారు. అండర్ 17 విభాగంలో సుజిత్ కుమార్ బాల్‌బ్యాడ్మింటన్, అండర్ 19 విభాగంలో అనీష్ బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయిలో ఆడేందుకు అర్హత సా ధించారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

108లో సుఖ ప్రసవం



శిశువును అందజేస్తున్న 108 సిబ్బంది

దొరవారిసత్రం: ఇటుక బట్టీ కార్మికురాలైన కాతమూరి చెంచమ్మ(30)కు 108 సిబ్బంది ప్రసవం చేసిన ఘటన ఆదివారం అర్ధరాత్రి కృష్ణాపురం ఎస్టీ కాలనీలో వద్ద చోటు చేసుకుంది. సిబ్బంది కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు, చెంచమ్మ దంపతులు కృష్ణాపురంలోని ఇటుకల బట్టీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చెంచమ్మకు ఆదివారం రాత్రి ఐదో కాన్పు నొప్పులు రావడంతో 108 సిబ్బందికి సమాచారం అందించింది. ఘటన స్థలానికి చేరుకున్న ఆ వాహన సిబ్బంది హైరిస్క్ కాన్పుగా గుర్తించి ఆన్‌లైన్‌లో డాక్టర్ శ్రీకాంత్ సలహాలు తీసుకుంటూ 108 వాహనంలోనే సాధారణ ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తల్లీబిడ్డను తరలించారు. ఇద్దరు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈఎంటీ, పైలెట్‌ను డీఎం అశోక్, ఆపరేషన్ ఎగ్జుక్యూ టివ్ అధికారి మనోజ్‌కుమార్ అభినందించారు.

భూములు మంజూరు చేయండి



తహసీల్దార్ లాజరస్‌తో మాట్లాడుతున్న గిరిజనులు

ఓజిలి: మండలంలోని కుందాం గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను తమ పంపి ణీ చేయాలని గిరిజనులు తహసీల్దార్ లాజరస్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము గ్రామంలో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వ భూములను కేటాయిస్తే సాగు చేసుకుని జీవనం సాగిస్తామని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ పంచాయతీ పరిధిలో సర్వే చేయించి ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన వారికి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భూగర్భజలాల పెంపునకే ఇంకుడు గుంతలు



ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న డీఈలు

చిల్లకూరు: వ్యర్థ జలాలు వృథాగా పోకుండా భూగర్భ జలాలను పెంపొందించేందుకే ప్రతి ఇంటి వద్ద ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రూ.5 వేల నగదు ఇస్తుందని హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో హౌసింగ్, ఆర్‌డబ్ల్యూస్ డీఈలు చలమయ్య, నందకుమార్, ఏఈలు విజయకుమార్, అహ్మద్‌బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అక్వేరియం చేపల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ శామ్యూల్

దొరవారిసత్రం: మండలంలోని పూలతోట సచివాలయంలో సోమవారం జిల్లా మత్స్య శాఖ అధికారులు అక్వేరియం చేపల పెంపకం, వివిధ రకాల చేపల ఉత్పత్తిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన సూళ్లూరుపేట వైల్డ్ లైఫ్ డీఎఫ్‌ఓ శామ్యూల్, మత్స్య శాఖ ఏడీ చాంద్‌బాషా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీలు పులికాట్ సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఇలాంటి వారు అక్వేరియం చేపల పెంపకంపై దృష్టి సారించి, సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చన్నారు. అలాగే వివిధ రకాల చేపల ఉత్పత్తిపై అవగాహన పెంచుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేపల ఉత్పత్తుల కోసం 90 శాతం రాయితీతో రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్‌డీఓ రెడ్డినాయక్, ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, ఫీల్డ్‌మెన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా..



బాధితురాలు, ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ

గూడూరు: ఓ డయాలసిస్ బాధితురాలు గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు ఫోన్ చేసి, తన సమస్యను వివరించడంతో స్పందించిన ఆయన క్షణాల్లోనే ఆ సమస్యను పరిష్కరించి, ఆమెకు డయాలసిస్ అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. పట్టణానికి చెందిన జీ మహేశ్వరి అనే యువతి డయాలసిస్ వ్యాధిగ్రస్తురాలు. ఆమె తల్లి తోపుడు బండిపై వ్యాపారం చేస్తూ జీవనం సాగించేది. వారి అడ్రస్ నెల్లూరుగా ఉండడంతో, గూడూరులో డయాలసిస్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆమె నెల్లూరుకే వెళ్లి అక్కడే డయాలసిస్ చేయించుకునేది. ఈ క్రమంలో ఆమె ఆర్థిక పరిస్థితి సరిగా లేక నెల్లూరుకు వెళ్లి డయాలసిస్ చేయించుకోలేని దయనీయ స్థితికి చేరుకుంది. దీంతో ఆమె ఆర్డీఓ ఫోన్ నంబర్ తీసుకుని, ఆయనకు ఫోన్ ద్వారా తన పరిస్థితిని వివరించింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ, వెంటనే తహసీల్దార్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసి, వెంటనే ఆర్‌ఐ, వీఆర్‌ఓలు బాధితురాలి వద్దకు చేరుకుని, క్షణాల్లో ఆమె ఆధార్ కార్డుపై అడ్రస్ మార్పునకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆమెకు వెంటనే గూడూరు ఏరియా ఆస్పత్రిలోనే డయాలసిస్ చేశారు. అనంతరం ఆర్డీఓ ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించి, పరీక్షల నిమిత్తం అయిన మొత్తాన్ని ఆయనే చెల్లించి, ఆమెకు మెరుగైన వైద్యం అందజేయాలని ఆర్‌ఎంఓను ఆదేశించారు.

మట్టి అక్రమ తవ్వకాల పరిశీలన



మట్టి తవ్వకాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రామయ్య

పెళ్లకూరు: మండలంలోని బంగారంపేట, శిరసనంబేడు, చెన్నప్పనాయుడుపేట గ్రామాల్లో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను సోమవారం తహసీల్దార్ రామయ్య పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో కొంత కాలంగా మట్టి తవ్వకాలు చేపట్టి నాయుడుపేట పరిధిలోని లేఅవుట్లకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టి అక్రమ తవ్వకాలను ఆయన పరిశీలించారు. అలాగే తాళ్వాయిపాడు గ్రామంలో అక్రమ లేఅవుట్లను పరిశీలించి స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వీఆర్వోలు రవీంద్రబాబు, వంశీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెరువు కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు

చిల్లకూరు: మన్నెగుంట సమీపంలోని మడక చెరువుకు నీరు వచ్చే కాలువను కొంత మంది అక్రమంగా పూడ్చి వేసి, రోడ్డు నిర్మిస్తున్నారని సర్పంచ్ ఏడుకొండలు, గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ అజతుల్లాఖాన్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఉన్న సిలికాను అక్రమంగా తరలించే క్రమంలో చెరువుకు నీరు వచ్చే కాలువను పూడ్చి వేసి, గ్రావెల్ రోడ్డును వేస్తున్నారని ఇదే జరిగితే చెరుకు నీరు రాకుండా నిలిచిపోతాయని, పంటలు పండించుకోలేమని, దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ వెంటనే వీఆర్వో సుభాషిణిని పంపి. రోడ్డు నిర్మాణం నిలిపి వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అందరికీ ఉపాధి పనులు

పెళ్లకూరు: ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నట్లు ఏపీఓ దయానంద్ పేర్కొన్నారు. సోమవారం నెలబల్లి పంచాయతీ పరిధిలోని టెంకాయతోపులో వ్యవసాయ కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. తొలుత గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేసి, పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముగియడంతో పనుల కోసం పట్టణాలకు వలస వెళ్లకుండా ప్రతి ఒక్కరికీ స్థానికంగా ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నిర్దేశించిన కొలతల మేరకు పనులు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఎఫ్‌ఏ తిరుపాలు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

గూడూరు: పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5వ తేదీన గూడూరు నుంచి రెండు బస్సు సర్వీసులను (తిరువణ్ణామలైకి(అరుణాచలం) నడపనున్నట్లు గూడూరు ఆర్టీసీ డీఎం వేంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు డిపో నుంచి ఉదయం 8, 10 గంటలకు రెండు బస్సు బయలుదేరి వెళతాయని తెలిపారు. గూడూరు డిపో నుంచి వెళ్లే బస్సు సర్వీసులకు ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

రైస్‌మిల్లు తనిఖీ



రైస్ మిల్లులో వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

తడ: మండలంలోని చెంగాళమ్మ రైస్ మిల్లును తడ తహసీల్దార్ కటారి జయరావు సోమవారం తనిఖీ చేశారు. కాదలూరు గ్రామంలో పంట ఆలస్యంగా రానున్న నేపథ్యంలో వారి వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, వారికి తగిన ధరను చెల్లించాలని తహసీల్దార్ మిల్లు నిర్వాహకులకు సూచించారు.

బ్రహ్మోత్సవాలకు తరలిరండి

గూడూరు: స్థానిక కోనేటిమిట్టలోని రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు భక్తులు తరలివచ్చి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు కోరారు. దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4, 5 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి క్లాసికల్ డ్యాన్స్ తోపాటు, ఫోక్ డ్యాన్సు, నాటక ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు. అలాగే శివలలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులు నాట్య ప్రదర్శనలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాయిపవన్, ధర్మకర్తలు సురేంద్రబాబు, పెంచలగౌడ్, నారాయణ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై సీతారాములు



సీతారాముల గ్రామోత్సవం

గూడూరు: స్థానిక కోనేటిమిట్టలో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి అమ్మవార్లు సింహవాహనంపై విహరించారు. ఉదయం హోమం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమానికి బండ్ల శ్రీనివాసులు, సుజాతమ్మ, సుమంత్‌కుమార్, సంధ్యారాణి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం



మాట్లాడుతున్న సునీత

వెంకటగిరి: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకుల సమష్టి కృషి అవసరమని ఏపీ పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బడిమల సునీత అన్నారు. ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఆ అసోసియేషన్ తిరుపతి జిల్లా ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పద్మశాలియుల అభ్యున్నతికి అసోసియేషన్ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి సెల్వరాజు, నాయకులు పరంధామయ్య, నాగేశ్వరరావు, ఎం రమణయ్య, ఎం మస్తాన్, సి సుబ్రమణ్యం, జి వెంకట్రామయ్య, డి సుబ్బరాయుడు, ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు



దాడిలో గాయపడిన హైమావతి, అశ్విన్, రూపేశ్వర్

కలువాయి: మండల కేంద్రంలో సోమవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కలువాయి దళితవాడ హాస్టల్ సమీపంలో ఆరుబయట కూర్చుని అన్నం తింటున్న ముగ్గురు పిల్లలపై దాడి చేసింది. ఈదాడిలో హైమావతి, అశ్విన్, రూపేశ్వర్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం కలువాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో మరో ఇద్దరిపై దాడి చేసింది. ఈ దాడిలో గాయపడిన బాలురను ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురావడంతో డాక్టర్ రామకుమారి వారికి ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేశారు.

అకాలవర్షం.. అన్నదాతకు కష్టం



తడిసిన ధాన్యాన్ని ఆర బెట్టుకుంటున్న రైతులు

ఓజిలి: మండలంలోని మాచవరంలో ఆదివారం కురిసిన అకాల వర్షంతో 300 పుట్ల ధాన్యం తడిచిపోయింది. గ్రామంలోని 50 మంది రైతులు రెండు రోజులు ముందు వరి పంట నూర్పిడి చేసి, ధాన్యాన్ని ఆరబెట్టారు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ధాన్యంలోకి నీరు చేరి తడిసిపోయింది. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారి విజయలక్ష్మి ధాన్యాన్ని పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. మళ్లీ వర్షం కురిస్తే ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని తెలియజేశారు. రైతులు ధాన్యం తడవకుండా పట్టలతో కప్పుకోవాలని తెలియజేశారు.